AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

ఏకదంతం.. అనేక రూపం..


2


2

అదుపు తప్పి లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

పౌష్టికాహారం తీసుకోవాలి



అక్షర టుడే,నందిపేట్: ఐలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేఖ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చన్నారు. సర్పంచ్ మీసాల లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ గాదె శ్రీనివాస్, వార్డు సభ్యురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు.



ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఐటీ టవర్ కేంద్రంగా కొనసాగుతున్న వివిధ కంపెనీల వివరాలను, వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 13 కంపెనీలలో 380 మంది వరకు పని చేస్తున్నారని టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కంపెనీల నిర్వాహకులను, అందులో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులను కలిసి స్థానికంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. సాధ్యమైనంత మేరకు ఎక్కువ కంపెనీలు స్థానికంగా నెలకొల్పేలా చూడాలని, తద్వారా ఈ ప్రాంత యువతకు స్థానికంగా మరింత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు. వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే స్టార్టప్ కంపెనీలకు ఐటీ టవర్ చక్కటి వేదికగా నిలుస్తుందని, దీనిని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట టీజీఐఐసీ ఏఈ శివకృష్ణ ఉన్నారు.

దసరాకు.. కొత్త పింఛన్లు



- కొత్త పింఛన్ల పంపిణీకి సర్కారు సన్నద్ధం
- వేగంగా సాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన
- వలస కుటుంబాలతో అధికారులకు ఇబ్బందులు

కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. దసరా నాటికి కొత్తగా దరఖాస్తు చేసిన వారికి పింఛన్లు ఇచ్చేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నారు. అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. అనంతరం పింఛన్లపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.

కామారెడ్డి జిల్లాలో..

చేయూత పింఛన్లలో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 14,819 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వితంతువుల విభాగంలో 8,434, ఒంటరి మహిళల విభాగంలో 1,837, వికలాంగుల విభాగంలో 3,626, చేనేత కార్మికుల విభాగంలో 344, కల్లుగీత కార్మికుల విభాగంలో 568 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల అర్హతను నిర్ధారించేందుకు అధికారులు నేరుగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఎంపీడీఓ, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో కూడిన సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు, పత్రాలను పరిశీలిస్తున్నారు. కుటుంబ పరిస్థితి, నివాసం, ఆధార్ తదితర వివరాలను పరిశీలించిన అనంతరం అర్హత ఉన్న వారిని సంబంధిత ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వలస కుటుంబాలతో ఇబ్బందులు

అనేక గ్రామాల నుంచి ఉపాధి కోసం కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం సాధారణంగా మారింది. కొన్ని గ్రామాల్లో వలసల కారణంగా పెద్ద సంఖ్యలో కుటుంబాలు ప్రస్తుతం గ్రామాల్లో అందుబాటులో లేకపోవడంతో పింఛన్ల దరఖాస్తుల పరిశీలన అధికారులకు సవాల్‌గా మారింది. క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లిన అధికారులకు దరఖాస్తుదారులు ఇంటి వద్ద లేకపోవడం, సరైన చిరునామా లభించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

చివరి అవకాశం కోల్పోకుండా..

వలస వెళ్లిన కుటుంబాల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది ద్వారా సేకరించి.. వీలైనంత త్వరగా అధికారులకు అందించాల్సిన అవసరం ఉంది. అర్హత ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి విచారణ సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల ఎవరూ నష్టపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అదేవిధంగా దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్లు, చిరునామా, అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అర్హుల ఆశలు ఫలించేనా?

ఏళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఈసారి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊరటనిస్తోంది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో వలస కుటుంబాల సమస్యలు ప్రధాన అవరోధంగా మారాయి. నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి.. దసరాకు ముందే పింఛన్లు అందిస్తే నిజమైన అర్హులకు ప్రభుత్వ చేయూత అందినట్లవుతుంది. ప్రస్తుతం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యే దిశగా లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్తగా చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 14,819 మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు 11వేలకు పైగా దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్ల మంజూరు లేకపోవడంతో ఆశావహులెందరో వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

గణపతి శోభాయాత్రకు ఆటంకాలు లేకుండా చూడాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు : ఇందూరులో నిర్వహించే వినాయకుడి శోభాయాత్రకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలో శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. దుబ్బ చౌరస్తా నుంచి లలితా మహల్, గాంధీ గంజ్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, పవన్ టాకీస్, గాజుల్ పేట్, పెద్ద బజార్, గోల్ హనుమాన్ మీదుగా వినాయకుల బావి వరకు శోభాయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరులో నిర్వహించే గణపతి శోభాయాత్ర ఎంతో ప్రత్యేకమైనది అన్నారు. సుమారు వందేళ్లుగా అనంత చతుర్దశి (ఈ నెల 25న) రోజున ప్రత్యేక రథంలో వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించామని, విద్యుత్, కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్, పోలీసు శాఖల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రధానంగా విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్లపై గుంతల పూడ్చివేత, అవసరమైన చోట బీటీ రోడ్ల నిర్మాణం, వినాయకుల బావి వద్ద సౌకర్యాలు పరిశీలించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండప నిర్వాహకులు శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, బీజేపీ కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, జ్యోతి మురళి, పంచరెడ్డి శ్యామ్, శ్రీనివాస్, మరావర్ కృష్ణ, వనిత తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం కోసం క్రేన్లను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి బుధవారం ప్రారంభించారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో క్రేన్లతో పాటు లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, బారికేడ్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ గణేష్ విగ్రహాల నిమజ్జనానికి వీలుగా ముందస్తుగా క్రేన్లను సిద్ధం చేయడం జరిగిందని, నిమజ్జన ఘాట్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. భక్తులు, నిర్వాహకులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత్ రావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓంగణేష్ మండలి అన్నదానంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న 'శ్రీ ఓం గణేష్ మండలి'లో బుధవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీ సాయిచైతన్య పాల్గొనగా మరో అతిథిగా అదనపు కలెక్టర్ భుజంగరావు విచ్చేశారు. మొదట పూజాకార్యక్రమం అనంతరం పోలీస్ కమిషనర్, అదనపు కలెక్టర్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు స్వయంగా చిన్నారులకు వడ్డించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పెద్ద మొత్తంలో స్నేహా సొసైటీ, గ్రేసీ ఆర్గనైజషన్ విద్యార్థులు, అదనపు డీసీపీ(అడ్మిన్) శుభం ప్రకాష్, అభిగ్యాన్ మాల్వియా (ఆర్మూర్ సబ్ కలెక్టర్), సురేష్ (అసిస్టెంట్ కలెక్టర్), సందీప్(ప్రొబేషనరి డిప్యూటీ కలెక్టర్), జిల్లా ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, టౌన్ ఏసీపీ ప్రకాష్, ఏఆర్ఏసీపీ కృష్ణ, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పాల్గొన్నారు.

నిఘా నీడలో కామారెడ్డి గణేష్ నిమజ్జన శోభాయాత్ర

అక్షరటుడే, కామారెడ్డి: పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సాఫీగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శోభాయాత్ర కోసం 420 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్ర మార్గంలో 162 సీసీ కెమెరాలు, 3 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బందోబస్తుపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్లు, నిమజ్జన ఘాట్ల వద్ద అదనపు బందోబస్తు, బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తామని తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యుత్సాహంతో ప్రమాదకర విన్యాసాలు చేయవద్దని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనవద్దని, డీజేలు, సౌండ్ సిస్టమ్స్ లో శబ్ద పరిమితులు పాటించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.






కాచాపూర్ పీఏసీఎస్‌ను వేరు చేయాలి..

అక్షరటుడే, కామారెడ్డి: కాచాపూర్ పీఏసీఎస్‌ను వేరు చేయాలని కాంగ్రెస్ పార్టీ కాచాపూర్ అధ్యక్షుడు వి. గాల్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ బైండ్ల సుదర్శన్‌తో కలిసి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి పనులు, వచ్చే వరి సీజన్‌లో రైతులకు రూ.500 బోనస్, గ్రామ సమస్యలు తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాచాపూర్ వార్డ్ మెంబర్ వి. మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి యాదగిరి రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మెంబర్ సాకలి భూమని సామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొగరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల నిర్వహణ అభినందనీయం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: టీఎన్జీవోస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల నిర్వహణ అభినందనీయమని అడిషనల్ కలెక్టర్ భుజంగరావు అన్నారు. ఎంప్లాయీస్ జేపీసీ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన గణనాథుడి చెంత నిర్వహించిన మహా అన్నదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా ఉద్యోగులు కుంకుమార్చన చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చకూరి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, కేపీ సునీత, శివకుమార్, పద్మ గంగరాజు, గీతారెడ్డి, విజయలక్ష్మి, సునీల్, స్వామి, త్రివేణి, మంగారెడ్డి, జాకీర్ హుస్సేన్, మారుతి, జ్ఞానేశ్వర్ రెడ్డి శ్రీనివాస్, శశికాంత్ రెడ్డి, విశాల్, సుజన్ కుమార్, సాయికుమార్ గౌడ్ పాల్గొన్నారు.





ఘనంగా వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలు

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కల్లెడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీసీసీ జనరల్ సెక్రటరీ డేగ పోశెట్టి ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వినయ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నీలగిరి శ్రీనివాస్, శివకృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో 'పోషణ మాసం' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరె నాగమణి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్యోతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సేవల ప్రాముఖ్యతను, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో సెక్టోరల్ సూపర్ వైజర్ శారద, కౌన్సిలర్లు నీలం రవి, బొదిరే నర్సయ్యలతో పాటు సెక్టోరల్ టీచర్లు పాల్గొన్నారు.






ఏకదంతం.. అనేక రూపం


ఏక దంతుడు అనేక రూపాల్లో కొలువయ్యాడు. విఘ్నాలు తొలగించే గణపయ్య భక్తులకు వివిధ రూపాల్లో దర్శనం ఇస్తున్నాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు మండపాల్లో వినూత్న రూపాల్లో గణనాథులను ఏర్పాటు చేశారు. పర్యావరణ హితంగా, విభిన్నమైన అలంకరణలతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో సాయంత్రం వేళల్లో భక్తులు ఆయా మండపాలను తమ కుటుంబాలతో కలిసి సందర్శిస్తున్నారు.

– అక్షరటుడే, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్











తెయూలో 24,25 తేదీల్లో ఫార్మా కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లు

అక్షరటుడే, తెయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీ లో ఈనెల 24, 25 తేదీల్లో ఐదేళ్లు ఫార్మా కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ రాంబాబు తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని, స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థి అందుబాటులో లేని సందర్భంలో స్పాట్ అడ్మిషన్‌లో స్థానికేతర అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామన్నారు.



ఆలూరులో మండల సర్వసభ్య సమావేశం

అక్షరటుడే, ఆర్మూర్ : ఆలూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలను సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ పనితీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. మాచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ కట్ట సర్వయ్య సమావేశంలో ప్రస్తావించారు. ఎంపీవో గంగామోహన్, సర్పంచులు ఇట్టిడి లింగారెడ్డి, కొండి గంగాధర్, తోగర్ల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఉత్తమ ఫలితాలు : డీఎంహెచ్‌వో



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఆయుర్వేద చికిత్సతో ఉత్తమ ఫలితాల లభిస్తాయని డీఎంహెచ్‌వో రాజశ్రీ పేర్కొన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నగరశివారులోని ముబారక్ నగర్‌లో మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ధన్వంతరి విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి ఔషధ మొక్కలు, చిరుధాన్యాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలిలో ఆయుర్వేదం ద్వారా మంచి ఫలితాలు ఉన్నాయన్నారు. దినచర్య, రుతు చర్యలో భాగంగా ప్రతిఒక్కరూ యోగాసనాల ద్వారా ఆరోగ్యం పదిలపర్చుకోవాలని సూచించారు. జిల్లా ఆయుష్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ గంగాదాస్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు అందరికీ ఆయుర్వేద దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయుర్వేద వైద్యం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతున్నాయన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో కార్పొరేటర్ రాము, మాజీ సర్పంచ్ హన్మాండ్లు, హోమియో వైద్యురాలు శ్రీవాణి, ఆయుర్వేద వైద్యులు వెంకటేష్, జయప్రకాష్, ప్రత్యూష పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా సైకిల్ యాత్రపై సమావేశం

అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న బోధన్ పట్టణం నుంచి ప్రారంభించనున్న సైకిల్ యాత్రకు సంబంధించిన వివరాలను నాయకులు వెల్లడించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 33 మండలాలు, 180 గ్రామాల మీదుగా 10 రోజుల పాటు సైకిల్ యాత్ర కొనసాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ, రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పాటుకూరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొన



సాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నరసయ్య, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు టి. చిన్నయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పోషణ మాసోత్సవాలు



అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని రెంజర్ల గ్రామంలో జాతీయ పోషణ మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం ప్రాధాన్యతపై గర్భిణులు, బాలింతలు, తల్లులు, మహిళలకు అవగాహన కల్పించారు. అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు, రోజువారీ పనులను సమర్థవంతంగా చేసుకునేందుకు సహాయపడుతుందని వివరించారు. అధిక ఉప్పు, చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. సరైన సమయంలో సరైన మోతాదులో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య-భూమేశ్వర్, ఉప సర్పంచ్ ఆకుల రాజేందర్, వార్డు సభ్యురాలు అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడీ టీచర్లు మేఘన, స్వరూప, షబానా, సైనా, ఎంఎల్‌హెచ్‌పీ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలపై అవగాహన



అక్షరటుడే, భీమ్‌గల్: బీడీ కార్మికులు, వారి పిల్లల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, విద్యా స్కాలర్‌షిప్‌లు, ఇతర వసతులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్మిక సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ సాగర్ ప్రధాన్ సూచించారు. భీంగల్ మండలం బాబాపూర్‌లోని చార్‌భాయ్ బీడీ కంపెనీలో బుధవారం కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీడీ కార్మికుల పిల్లల విద్యా స్కాలర్‌షిప్‌ల కోసం కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.2,52,000 కు పెంచినట్లు వెల్లడించారు.

ఆలూరులో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ఎంఈవో నరేందర్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మొక్కల ప్రాధాన్యతను తెలుసుకుని వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేష్, పీడీ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు



అక్షరటుడే, కామారెడ్డి: ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన బైపాస్ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. నాగపూర్ నుంచి హైదరాబాద్ వైపు ఆలుగడ్డలను తీసుకువెళ్తున్న క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో లారీ ఒక్కసారిగా రోడ్డు పక్కకు ఒరిగి పడిపోయింది. లారీలో ఉన్న ఆలుగడ్డల బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసి చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు.

నగరంలో అదృశ్యమైన వ్యక్తి బలవన్మరణం



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: తప్పిపోయిన వ్యక్తి నగర శివారులోని నిజాంసాగర్ కాలువలో శవమై తేలాడు. అ మేరకు 5వ పోలీస్‌స్టేషన్ పోలీసులు వివరాలు వెల్లడించారు. నగరం లోని ఇంద్రాపూర్ కాలనీకి చెందిన కండగాలే అశోక్ పెయింటర్‌గా పనిచేస్తుండేవాడు. అయితే అయన ఈనెల 21వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో ఆయన తల్లి తులసీ 5వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే 23వ తేదీ బుధవారం అశోక్ మృతదేహం నగరశివారులోని నిజాంసాగర్ కాలువలో తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల శిక్షణ శిబిరం ప్రారంభం



అక్షరటుడే, కమ్మర్‌పల్లి: సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని బుధవారం ఉదయం కమ్మర్‌పల్లి గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ప్రారంభించారు. కమ్మర్‌పల్లి సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు కమ్మర్‌పల్లికి వచ్చి శిక్షణ పొందడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులకు అవసరమైన భోజన, వసతి సౌకర్యాలు కల్పించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ మాట్లాడుతూ.. ఈ నెల 27 నుండి 30 వరకు మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో జరిగే జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాల, బాలికల జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర జట్లకు మెరుగైన శిక్షణ అందించేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరం ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి. మల్లేష్ గౌడ్, జెడ్పీహెచ్ హెచ్ఎం సాయన్న, నాగభూషణం, వెంకటేష్, విక్రమ్, కోచ్‌లు అనికేత్, నరేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.